లక్ష్యం ఘనం.. ఆచరణ శూన్యం 2

బైక్‌పై శునకం షికారు 2

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

10-8-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2





## రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని పోల్కంపేట క్లస్టర్ పరిధి రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ రాకేష్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. జూన్ 5 వరకు కొత్తగా పాస్ పుస్తకాలు పొందినవారు, ఇదివరకు రైతు బీమాకు దరఖాస్తు చేయని రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే, గతంలో రైతు బీమా కోసం దరఖాస్తు చేసిన రైతులు నామినీ మార్పు కోసం ఈ నెల 12 లోగా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. రైతు పట్టా పాసు బుక్, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ జిరాక్స్ ప్రతులతో ఏఈఓలకు అందజేయాలని తెలిపారు. ఆధార్ ప్రకారం 18-59 ఏళ్ల లోపు రైతులు అర్హులన్నారు.



## నిజాంసాగర్‌లోకి భారీ ఇన్‌ఫ్లో

**అక్షరటుడే, నిజాంసాగర్:** నిజాంసాగర్ ప్రాజెక్టు ఎగువ భాగంలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతోంది. జలాశయంలోకి ఆదివారం మధ్యాహ్నానికి భారీ ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్ట్ ఏఈలు సాకేత్, అక్షయ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 1,405.00 అడుగులు 17.80 టీఎంసీలకుగాను 1,391.27 అడుగులు 4.607 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ భాగం నుంచి 3,517 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తుందని అధికారులు పేర్కొన్నారు. మంజీర నదిపై నిర్మించిన నిజాంసాగర్‌కు కర్ణాటకలో వర్షాలు పడితేనే భారీగా వరద వస్తుంది. మంజీరకు వరద వస్తే మొదట సింగూరు ప్రాజెక్ట్ నిండాలి. అనంతరం దిగువకు నీటిని విడుదల చేస్తారు.

## శ్రీరామ్‌సాగర్‌కు కొనసాగుతున్న వరద..

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఉత్తర తెలంగాణ జిల్లాల వర ప్రదాయిని శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ కు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. స్థానికంగా కురుస్తున్న వర్షాలతో పాటు మహారాష్ట్ర నుంచి గోదావరికి వరద వస్తోంది. దీంతో జలాశయంలోకి ప్రస్తుతం 28,147 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 (80.5 టీఎంసీలు) అడుగులు కాగా.. ప్రస్తుతం 1078.80 (41.907 టీఎంసీలు) అడుగులకు నీరు చేరింది. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 47.250 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టుకు నీటి విడుదల కొనసాగుతోంది. ఆగస్టు 7న కాలువల ద్వారా నీటి విడుదలను ప్రారంభించారు. ఎస్సారెస్పీ కింద ఉన్న ఆరు లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రస్తుతం నీటిని వదులుతున్నారు. కాకతీయ కాలువ ద్వారా 3వేల క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 3వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, లక్ష్మీ కాల్వ ద్వారా 150 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, అలీ సాగర్ ఎత్తిపోతలకు 180 క్యూసెక్కులు, గుత్ప ఎత్తిపోతలకు 270 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాలువల ద్వారా నీటిని వదులుతుండటంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నవంబర్ 20 వరకు ఆయకట్టుకు నీటిని విడుదల చేయనున్నారు. కాకతీయ కాలువ పరిధిలోని జోన్ 1 ఏడు రోజులు, జోన్ 2 కు 8 రోజులపాటు వారాబంధీ ప్రకారం నీటిని అందించనున్నారు. మిగిలిన కాలువలకు ఏడు రోజుల ఆన్ ఆఫ్ పద్ధతిలో నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కొత్త రవి తెలిపారు.

**జిల్లాలో పేకాట జోరుగా సాగుతోంది. మూడు ముక్కలాటకు బానిసలుగా మారిన వారు నిత్యం ఆడటానికి వెళ్తున్నారు. అయితే పోలీసులు తరుచు దాడులు చేస్తుండటంతో వీరు అడ్డాలు మారుస్తూ పేకాట ఆడుతున్నారు. అటవీ ప్రాంతాల్లో కొందరు పేకాట నిర్వహిస్తున్నట్లు తెలిసింది. వీరు పోలీసుల నుంచి తప్పించుకోవడానికి ఏకంగా కాపలాదారులను నియమించుకోవడం గమనార్హం. - అక్షరటుడే, ఇందూరు**



# అడ్డాలు మారుస్తూ పేకాట

- పోలీసులకు చిక్కకుండా ఎత్తుగడ
- దాడి చేస్తే సమాచారం ఇవ్వడానికి 8 మంది కాపలాదారులు
- డబ్బు పోతే అప్పు ఇచ్చి మరీ ఆడిస్తున్న వైనం

జిల్లాలోని వర్ని మండలంలోని దట్టమైన అడవిలో గత కొన్ని రోజులుగా పేకాట కొనసాగుతోంది. అయితే ఈ పేకాట స్థావరాలను ఆరుగురు వ్యక్తులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. బోధన్, నిజామాబాద్, బాన్సువాడకు చెందిన పలువురు ప్రముఖులు, వ్యాపారులు, లీడర్లు, బడాబాబులు వీరి దగ్గర పేకాడటానికి వస్తున్నట్లు తెలిసింది. దీంతో నిర్వాహకులు పోలీసులకు చిక్కకుండా నిత్యం స్థావరాలను మారుస్తున్నారు. వర్ని మండలంలోని శ్రీనగర్, వర్ని గండి, పొట్టిగుట్ట, శంకోర, మల్లారం గండి తదితర ప్రాంతాల్లో పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నారు. ఒక రోజు ఆడిన చోట మరుసటి రోజు ఆడకుండా జాగ్రత్త పడుతుంటారు. గతంలో పోతంగల్‌లో పేకాట స్థావరం నిర్వహించేవారు. ప్రస్తుతం స్థావరాలను మారుస్తూ నిత్యం రూ.లక్షల్లో జూదం ఆడుతున్నారు. ఈ పేకాట నిర్వాహకులను మాస్, మిర్చి అనే కోడ్ నేమ్‌లతో పిలుస్తారు. వీరిపై గతంలో రుద్రూర్‌లో కేసులు కూడా నమోదైనట్లు తెలిసింది.

### కాపలాదారులకు వేతనం

పేకాట స్థావరం పోలీసులకు, ఇతరులకు తెలవకుండా ఉండేందుకు నిర్వాహకులు పక్కా ప్రణాళిక రచించారు. ప్రధానంగా అటవీ ప్రాంతంలో ఇతరులు ఎవరైనా వస్తే సమాచారం అందించేలా కాపలాదారులను నియమించారు. సుమారు ఎనిమిది మంది కాపలాదారులు స్థావరానికి చుట్టుప్రక్కల మోహరించి ఉంటారు. అలాగే జూదం ఆడేవారిని స్థావరానికి చేర్చేందుకు ప్రత్యేక కారును అందుబాటులో ఉంచారు. కారులో పేకాటరాయుళ్లను చేర్చినందుకు ఒక రోజుకు రూ.రెండు నుంచి రూ.మూడు వేలు కిరాయి చెల్లిస్తున్నారు. అలాగే కాపలాదారులకు నిత్యం రూ.వేయి నుంచి రూ.2 వేల వరకు వేతనం ఇస్తున్నట్లు తెలిసింది.

### కాయిన్ విలువ రూ.2 వేలు

జూదం ఆడే సమయంలో పోలీసులకు చిక్కితే నగదు దొరకకుండా ఉండేందుకు నిర్వాహకులు కొత్త ఎత్తుగడ రూపొందించారు. క్యాసినో కాయిన్స్ తరహా ఫోకస్ చిప్స్ వాడుతున్నారు. ఒక్కో కాయిన్ ధర రూ.2 వేలుగా నిర్ణయించి ఆడుతున్నారు. ఇలా నిత్యం రూ.లక్షల్లో పేకాటను కొనసాగిస్తున్నారు. అయితే జూదమాడి డబ్బులు పోగొట్టుకున్న వారికి అప్పు ఇచ్చి మరీ ప్రోత్సహిస్తున్నారు.

## చంద్రబాబుకు గురుదక్షిణ ఇచ్చేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నం

- కాళేశ్వరం పై జస్టిస్ ఘోష్ రిపోర్ట్ పొలిటికల్ రిపోర్ట్ గా మారింది
- ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి

**అక్షరటుడే, ఇందూరు:** ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించేందుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి బీజేపీతో కలిసి మేడిగడ్డను నిలిపేసి గోదావరి నీళ్లను ఆంధ్రకు వదిలే ప్రయత్నం చేస్తున్నారని, ప్రధానంగా బనకచెర్లకు నీళ్లను వదిలి గురుదక్షిణ చెల్లించుకోవాలని చూస్తున్నారన్నారు. కాళేశ్వరంను కొండంతగా చూపిస్తూ కేసీఆర్ ను అణచి వేయాలని చూస్తున్నారని, అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రాజెక్టు కూలిందంటూ అసత్య ప్రచారం చేసి, ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలకు అదే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. జస్టిస్ గోష్ రిపోర్ట్ రేవంత్ రెడ్డి, చంద్రబాబు, బీజేపీల కలయికతో రూపొందించిందని ఆయన విమర్శించారు. రిపోర్ట్ ను సీల్డ్ కవర్ లో అధికారులకు సమర్పిస్తే, అంతకుముందే కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరంపై ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కొన్ని మీడియా సంస్థలు కూడా ఇందుకు వత్తాసు పలుకుతున్నాయని, ఇది పొలిటికల్ కమిషన్ రిపోర్ట్ గా మారిందని చెప్పారు. 2007 నుంచి 2014 వరకు మహారాష్ట్ర, తెలంగాణతో పాటు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్ట్ ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీకి, మూసి ప్రాజెక్ట్ కి ఎలాంటి అనుమతులు లేకున్నా ఎన్డీఎస్ఏ క్లియరెన్స్ వచ్చిందన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడారు. సమావేశంలో జిల్లా నాయకులు దాదన్న గారి విట్టల్, బాజిరెడ్డి జగన్, ప్రభాకర్, సుజిత్ సింగ్ ఠాకూర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

## సంఘాలతో సామాజిక సమైక్యత

**అక్షరటుడే, ఇందూరు:** సంఘాలతో సామాజిక సమైక్యత పెంపొందుతుందని, గాండ్ల సంఘం సేవా కార్యక్రమాల ద్వారా ఇతరులకు మార్గదర్శకంగా నిలవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ అన్నారు. ఆదివారం నగరంలో గాండ్ల పట్టణ సంఘం ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. సంఘ అభివృద్ధికి, నూతన కమిటీకి తన పూర్తి మద్దతు ఉంటుందన్నారు. పట్టణ గాండ్ల సంఘం ఐకమత్యంతో అంచలంచెలుగా ఎదుగాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నాగరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, కాంగ్రెస్ నాయకులు నరాల రత్నాకర్, రాంభూపాల్, సంఘం ఉపాధ్యక్షుడు రాజేంద్ర, గోపి, సెక్రెటరీ కాసర్ల మోహన్, జాయింట్ సెక్రెటరీ సాయన్న తదితరులు పాల్గొన్నారు.

## 13న ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ మహామేళ



**అక్షర టుడే, ఇందూరు:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఈ నెల 13వ తేదీన "మార్కింగ్ మహామేళా" నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఇళ్ల మార్కింగ్ చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రొసీడింగ్స్ పూర్తయి మార్కింగ్ చేసుకోలేకపోయిన లబ్ధిదారులకు 13వ తేదీన మార్కింగ్ పూర్తిచేసి, ఇళ్ల నిర్మాణం ప్రారంభించేలా ప్రోత్సహిస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా 17,301 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇందులో ఇప్పటికే 9,486 ఇల్లు గ్రౌండింగ్ జరిగాయని వివరించారు.

## ఆలయ నిర్మాణానికి భూమిపూజ



**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని సజ్జన్ పల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెద్దమ్మ తల్లి ఆశీసులతో ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో ఉండాలనీ ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధి కోసం పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో పాల్గొని, భక్తులకు అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాగౌడ్, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు అధ్యక్షుడు బట్టు విఠల్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు సాయి కుమార్, సంఘం నాయకులు పాల్గొన్నారు.



## రోడ్డుపై పచ్చని పందిరి

**ఇరువైపులా పచ్చని చెట్లతో ఆ మార్గం వాహనదారులను ఆకట్టుకుంటుంది. నందిపేట మండల కేంద్రం నుంచి శాపూర్ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా చెట్లు ఉన్నాయి. వర్షా లకు ఆ చెట్లు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఆ మార్గంలో వెళ్లేవారికి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.**

**– అక్షరటుడే, ఆర్మూర్**

## దుర్గాదేవి ఆలయ నూతన కార్యవర్గం ఎన్నిక

**అక్షరటుడే, వెబ్ డెస్క్:** నగరంలోని గుమస్తా కాలనీలోగల శ్రీ దుర్గాదేవి ఆలయ సర్వసభ్య సమావేశం జె. మల్లేష్ యాదవ్, ఆకుల సందీప్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అమందు విజయ్ కృష్ణ, ఉపాధ్యక్షులుగా సంతోష్, అనిల్ కుమార్, కిషన్, ప్రధాన కార్యదర్శిగా బోడికే బాబురావు, కార్యదర్శులుగా రాజేష్, వెంకటేష్, కోశాధికారిగా దాత్రిక వేణుగోపాల్, లవంగ సదాశివ్, గౌరవ సలహాదారులుగా రాజేందర్, భీమన్న, కార్యవర్గ సభ్యులుగా దానాజీ, దుబ్బయ్య, సంతోష్, ఉషన్న, శ్రీనివాస్, రామకృష్ణ, ప్రవీణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు విజయ్ కృష్ణ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష పదవిని అప్పగించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గుమస్తా కాలనీ సభ్యులు పాల్గొన్నారు.



## వైభవంగా బారడి పోచమ్మ బోనాలు



**అక్షరటుడే, నిజాంసాగర్:** పిట్లం మండలకేంద్రంలో ఆదివారం బారడి పోచమ్మ పండుగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం బోనాల ఊరేగింపు నిర్వహించగా, శివసత్తులు, పోతరాజుల విన్యాసాలతో ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్, వాసరి రమేష్, వైస్ ఎంపీపీ నర్సాగౌడ్, జగదీష్ నవీన్, లక్ష్మారెడ్డి, రహిమత్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.



## మల్లూరు గ్రామ సమస్యలు పరిష్కరించాలని వినతి

**అక్షరటుడే, నిజాంసాగర్:** మల్లూరు గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావును ఆదివారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లూరు గ్రామ శివారులోని సర్వే నం.765లో ఉన్న రైతుల భూసమస్యను పరిష్కరించాలని వారు కోరారు. మల్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి మల్లూరు తండా బీటీ రోడ్డు వరకు ఫార్మేషన్ రోడ్డు నిర్మించాలని వారు వినతిపత్రంలో కోరారు. అలాగే ఏటిగడ్డ వద్ద సూదిరెడ్డి రాంరెడ్డి వ్యవసాయ పొలం వద్ద మంజీర నదిపై హైలెవల్ బ్రిడ్జిని నిర్మించాల్సింగా వారు విన్నవించారు.
అదేవిధంగా మల్లూరు తండా రోడ్డు నుంచి పల్లె శివారులోని వ్యవసాయ భూముల ప్రాంతానికి వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న మాసిరెడ్డి చెరువు కాలువపై వంతెన నిర్మాణం చేపట్టాలని సూచించారు. మల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీని నిర్మింపజేయాలని విన్నవించారు. ఈ సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఒంటరి శ్రీనివాస్ రెడ్డి, బుడిమి శ్రీనివాస్, పెద్ది అంజయ్య, నాగంపల్లి కృష్ణ, శ్రీధర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బైక్‌పై శునకం షికారు..



నగరంలో పోచమ్మగల్లీలోని ఓ శునకం ఇలా బైక్‌పై జాలీగా వెళ్తూ కనిపించింది. పోచమ్మగల్లీ నివాసముండే ప్రణయ్ అనే వ్యక్తి నిత్యం ఇలా శునకాన్ని నగరంలోని పాత కలెక్టర్ గ్రౌండ్‌కు వాకింగ్ తీసుకెళ్తూ ఉంటాడు. అనంతరం బైక్‌పై కుక్కను కూర్చో బెట్టుకుని ఇంటికి తీసుకెళ్తుంటాడు. బైక్‌పై ఇలా విలాసంగా కూర్చున్న కుక్కను చూసి 'ఔరా.. శునక విలాసం..' అంటూ మాట్లాడుకుంటున్నారు. – అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్



# లక్ష్యం ఘనం.. ఆచరణ శూన్యం

- నర్సరీల్లోనే ఉండిపోయిన మొక్కలు
- పట్టించుకోని అధికారులు, సిబ్బంది

**ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేసింది. వనమహోత్సవంలో భాగంగా వేలల్లో పలు రకాల మొక్కలను నాటింపజేసింది. ప్రభుత్వ లక్ష్యం ఘనంగానే ఉన్నా ఆచరణలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు.**
**- అక్షరటుడే, నిజాంసాగర్**

గ్రామపంచాయతీ పాలక వర్గాలు ఉండగా ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద నర్సరీలను ఏర్పాటు చేశారు. ఒక్కో నర్సరీలో నాలుగు వేలకు పైగా పండ్లు, ఇతర రకాల మొక్కలను పెంచారు. నర్సరీల్లో మొక్కలను పెంచేందుకు కూలీలను ఏర్పాటు చేశారు. మొక్కలు ఎండిపోకుండా చలువ పందిరి ఏర్పాటు చేశారు. నిత్యం నీళ్లు పట్టి అవి పెరిగేలా జాగ్రత్తలు తీసుకున్నారు.



నర్సరిలో ఉన్న మొక్కలు

### వర్షా కాలం రానేవచ్చింది..

వర్షాకాలం నాటికి నర్సరీల్లో ఉన్న మొక్కలన్నింటిని తీసుకెళ్లి గ్రామాల్లో ఓ పద్ధతి ప్రకారం నాటాల్సి ఉండగా.. అధికారులు, సిబ్బంది వాటి సంగతే మరిచిపోయారు. మొక్కలన్నీ నర్సరీల్లోనే పెరిగి పెద్దగా అవుతున్నా వాటిని పట్టించుకునేవారు లేకపోయారు. అయితే వర్షాలు సైతం అంతంతమాత్రమే కురుస్తుండడంతో అధికారులు మొక్కలు నాటే లక్ష్యాన్ని కుదించారు. దీంట్లో భాగంగా ఒక్కో గ్రామంలో 2,500 మొక్కలను నాటాలని లక్ష్యాన్ని నిర్ణయించుకున్నారు. అయితే ఆ లక్ష్యం కూడా ఏ గ్రామంలోనూ పూర్తి కాలేదు.

### నర్సరీల్లోనే ఉండిపోయాయి..

అడపాదడపా కురుస్తున్న వర్షాలకు గుంతలు తీసి మొక్కలను నాటి ఉంటే ఈపాటికి అవి పెరిగిపోయేవని నర్సరీల్లో నే ఉంచితే ఏమిటి ప్రయోజనమని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం నర్సరీల్లో ఉన్న మొక్కల ఆలానాపాలన కరువవడంతో మొక్కలు చనిపోయే అవకాశాలున్నాయని గ్రామస్థులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉపాధి హామీ అధికారులు స్పందించి గ్రామాలలో మొక్కలను నాటి లక్ష్యాన్ని పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




## మూతపడ్డ అంగన్‌వాడీ కేంద్రం

**అక్షరటుడే, నిజాంసాగర్:** మండలంలోని మాగి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం మూతపడింది. కేంద్రంలో విధులు నిర్వహించే కార్యకర్త ఇటీవల పదవీవిరమణ పొందడంతో పక్కనే మరో కేంద్రానికి చెందిన పలువురు కార్యకర్తలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే వారు సక్రమంగా కేంద్రానికి రాకపోవడంతో గ్రామంలోని కేంద్రాన్ని పట్టించుకునేవారు లేకపోయారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన 15 రోజుల వ్యవధిలో రెండు మూడు సార్లు మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరిచారని వారు పేర్కొంటున్నారు. దీంతో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు తెలియజేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖకు చెందిన అధికారులు స్పందించి కేంద్రాన్ని నిత్యం తెరిచిఉంచేలా చూడాలని కోరుతున్నారు.

## ఆర్మూర్ శివారులో చిరుత కలకలం.. పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు

**అక్షరటుడే, ఆర్మూర్:** జిల్లాలో వరుసగా చిరుత పులుల ఆనవాళ్లు కలకలం సృష్టిస్తున్నాయి. ఇటీవల ఎడపల్లి మండలంలోని జానకంపేట్‌లో మేకలపై చిరుత దాడి చేసింది. అనంతరం అభంగపట్నంలోనూ లేగదూడపై చిరుతపులి దాడి చేసి చంపేసింది. పట్టణ శివారులోని పెద్దమ్మగుడి ఆలయ పరిసరాల్లో పులి కలకలం సృష్టించింది. ఆలయ పరిసరాల్లో పులి తిరుగుతోందని గ్రామస్థులు అటవీశాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆదివారం ఫారెస్ట్ అధికారులు పెద్దమ్మగుడి పరిసరాలను పరిశీలించారు. ఇప్పటి నుంచి ఆలయ పరిసరాలను తమ ఆధీనంలోకి తీసుకుంటామని.. నిశితంగా పులి సంచారాన్ని గమనిస్తామని వారు తెలిపారు. భక్తులు సైతం పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించాకే గుడి వద్దకు రావాలని ఫారెస్ట్ అధికారులు సూచించారు.





## భక్తిశ్రద్ధలతో గై పీర్ సవారీ వేడుకలు

**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూర్ మండల కేంద్రంలో గై పీర్ సవారీ వేడుకలను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జెండాలు, పూలమాలలు, ధూపదీపాలతో ఊరేగింపుగా దర్గాకు తరలివెళ్లారు. ప్రధాన వీధుల గుండా సాగిన ఊరేగింపు అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ వేడుకలో అగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్, విజయ్ ప్రకాష్, రఘు, రాజు పటేల్, శశికాంత్, రాములు, హన్మాండ్లు, మన్నన్, అజహర్, రఘు పాల్గొన్నారు.

## పీఏసీఎస్ ఉద్యోగుల జిల్లా కార్యవర్గ ఎన్నిక



**అక్షరటుడే, వెబ్డెస్క్:** ఏసీఎస్ ఉద్యోగుల కామారెడ్డి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంతంపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సంగగోని సంగమేశ్వర్, అసోసియేట్ ప్రెసిడెంట్ గా మందాడి సంతోష్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా సాయి ప్రకాశ్, భాస్కర్, ఎర్గె వీరేశం, శ్రవణ్ కుమార్, లలితను ఎన్నుకున్నారు.



## ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఆవరణలోని నాగ లింగేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, జంట నాగుల విగ్రహ ప్రతిష్ఠాపనను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సత్య శ్రీనివాస్, అంబికా రమేష్, రాజయ్య, కలిగోట గంగాధర్, బీజేపీ జిల్లా నాయకులు జీవీ నర్సింహారెడ్డి, బాలజీ, రెడ్డిప్రకాష్, బండి బాబు, నారాయణ పాల్గొన్నారు.

# ఆకట్టుకునే తీజ్ ఉత్సవాలు..!

### ప్రత్యేక ఆకర్షణగా పురుషుల నృత్యాలు

**అక్షరటుడే, గాంధారి:** గిరిజనుల సంప్రదాయ పండుగ తీజ్ ఉత్సవాలు వైభవంగా జరుపుకుంటారు. తొమ్మిది రోజులపాటు జరుపుకునే ఈ ఉత్సవాల్లో యువతులు గోధుమబుట్టలతో మంచి వరుడు రావాలని కోరుకుంటూ పూజలు చేస్తారు. ఇందులో భాగంగానే రాఖీ పండుగ రోజున గిరిజన పురుషులు ప్రత్యేకంగా నృత్యాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. గాంధారి మండలంలోని గుర్జాల్‌తండాలో శనివారం రాఖీ పండుగ సందర్భంగా ఈ నృత్యాలు అలరించాయి. ముందుగా అక్కాచెల్లెల్లు వారివారి అన్నాతమ్ముళ్లకు రాఖీలు కడతారు. అనంతరం అందరూ ఒకే దగ్గరికి చేరి, ఇలా డోలు భాజాలతో సంప్రదాయబద్ధంగా నృత్యాలు చేస్తుంటారు. తీజ్ పండుగ సందర్భంగా తొమ్మిది రోజులు ఉపవాసం చేస్తారు. ఇందులో రాఖీ పండగ రోజు జరిగే ఈ విశిష్ట కార్యక్రమంలో పురుషులు నృత్యం చేస్తుంటారు.



ఈ ఆచారం తాత ముత్తాతల నుంచి వస్తోందని వారు తెలిపారు. ఇలా చేస్తే పాడిపంటలతో సమృద్ధిగా ఉంటామని వారి నమ్మకం.

### లబానాలకు గుర్తింపునిచ్చేది ఈ నృత్యం

మా పూర్వకాలం నుంచి ఈ నృత్యం చేస్తూ ఉంటాము. ఆచారంగా వస్తున్న ఈ సాంప్రదాయ నృత్యాన్ని మా కులస్థులు చేస్తూ ఉంటారు. రాంనవ్ అంటే రాముడు. ఆయన తొమ్మిది అవతారాల గురించి నృత్యాలు చేస్తుంటారు. ఈ నృత్యం మంగారాగా పేరుగాంచింది.
– తాన్ సింగ్, రాష్ట్ర లబానా సంఘం అధ్యక్షుడు



## ఆదమరిస్తే అంతే సంగతి..



**మండల కేంద్రంలోని కస్తూర్బా స్కూల్ సమీపంలో చిన్న వంతెన వద్ద గుంత పూర్తిగా నీటితో నిండి ప్రమాదకరంగా ఉంది. వాహనదారులు గమనించక ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. ఈ సందర్భంగా అధికారులు స్పందించి నీటితో కూడిన గుంతలను పూడ్చివేసి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.**
**- అక్షరటుడే, గాంధారి**

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**అక్షరటుడే, నిజామాబాద్:** నాలుగో టౌన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు. మృతుడి వయస్సు 40-50 ఏళ్ల లోపు ఉంటుందని, కొన్ని రోజులుగా బోర్గం(పి) ప్రాంతంలో పాత సామాన్లు, చెత్త ఏరుకుంటూ, మద్యం తాగి పుట్ పాత్ పై పడుకునేవాడు. ఈ క్రమంలో అనారోగ్యం బారిన పడ్డాడు. ఈ నెల 9న రాత్రి ఫిట్స్ తో చనిపోయి ఉంటాడని అనుమానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ప్రభుత్వ హాస్పటల్ లో భద్రపరిచినట్లు చెప్పారు. మృతుడి సంబంధీకులు పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని సూచించారు.